క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



జాహ్నవి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలో ఈ నెల 26న రైలు ఢీకొని కె.జాహ్నవి మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గురువారం పరామర్శించారు. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎంపీ భరత్‌రామ్ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డితో కలసి జాహ్నవి తల్లిదండ్రులు గంగాధరరావు, భవాని దంపతులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీసు క్రమబద్ధీకరణ హర్షణీయం

రాజానగరం: కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీసును క్రమబద్ధీకరిస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించడం హర్షణీయమని ఏపీ ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డాక్టర్ వొలుపు కనక రాజు, గొర్ల మాణిక్యం అన్నారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని ఆచరణలో పెట్టి తమ జీవితాలలో వెలుగులు నింపారన్నారు. తమ సర్వీసులను క్రమబద్ధీకరిస్తామంటూ గత పాలకులు హామీలు ఇచ్చిన వారేగాని, ఆచరణలో ఎవ్వరూ చూపలేకపోయారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చి తనకు చాటి లేరని మరోసారి నిరూపించుకున్నారన్నారు. రాష్ట్రంలో 10,117 మంది కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీసును రెగ్యులరైజ్ చేశారన్నారు.

మోక్ష మార్గం ప్రవక్త జీవితం



బిక్కవోలులో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

బిక్కవోలు: మోక్ష మార్గం ప్రవక్త జీవితమని మహ్మద్ షహజాద్ అష్రఫీ అన్నారు. గురువారం బిక్కవోలు ఇమామ్ మదీనా మసీద్ వద్ద మిలాద్– ఉన్– నబీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లింలు ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ అట్టడుగు వర్గాలను ఆదుకోవాలని అన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా శాంతి మంత్రాన్ని వీడరాదన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో షేక్ మహబుబ్ జానీ, షేక్ ఉస్మాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం



విమానాశ్రయం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ జగదీష్

మధురపూడి: శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ అన్నారు. ఆయన గురువారం కోరుకొండ, రాజమహేంద్రవరం విమానాశ్రయం పోలీసుస్టేషన్లను తనిఖీ చేశారు. అక్కడి రికార్డులు, స్టేషన్ రిసెప్షన్ హెల్ప్‌డెస్క్, సీసీ కెమెరాలను పరిశీలించారు. పోలీసులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రౌడీషీటర్లు, బ్లేడ్ బ్యాచ్, పాత నేరస్తులపై ప్రత్యేకంగా నిఘా ఉంచాలన్నారు. రహదారి భద్రత, ప్రమాదాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకుఅవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్సై కట్టా శారదా సతీష్, ఎయిర్‌పోర్టు ఎస్సైలు వి. సత్యనారాయణ, ఝాన్సీ ఉన్నారు.

గుమ్ములూరులో విద్యార్థుల ర్యాలీ



నినాదాలు చేస్తున్న విద్యార్థులు

మధురపూడి: కోరుకొండ మండలం గుమ్ములూరులో గురువారం హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ చేశారు. నా భూమి – నా దేశం కార్యక్రమంలో భాగంగా జాతీయ నాయకుల చిత్రపటాలతో ప్రదర్శన జరిపారు. మహనీయుల గొప్పతనాన్ని తెలియజేస్తూ నినాదాలు చేశారు. ప్రధాన కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గొర్రెల లక్ష్మణరావు, హైస్కూల్ హెచ్‌ఎం గంగాభవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్కారు బడి.. సాంకేతిక ఒరవడి

- ఐఎఫ్‌పీ ద్వారా విద్యాబోధన
- తరగతి గదికే ప్రపంచ విజ్ఞానం



దోసకాయలపల్లి హైస్కూల్లో ఐఎఫ్‌పీ ద్వారా మహాత్మాగాంధీ జీవితంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చదువుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. పాఠశాలల అభివృద్ధి, వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతోంది. అనేక పథకాలు, కార్యక్రమాలతో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతోంది. కార్పొరేట్ స్కూళ్లలో రూ.లక్షల్లో ఫీజుల కడితే గానీ దొరకని విద్య, బోధనా పద్ధతులను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం, షూ అందిస్తోంది. మధ్యాహ్నం భోజనం పథకంలో నాణ్యమైన ఆహారం అందిస్తోంది. ఇక వైద్య పరీక్షలు కూడా తరచూ నిర్వహిస్తోంది.

విజ్ఞాన కేంద్రాలుగా..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలలు విజ్ఞాన కేంద్రాలుగా మారాయి. ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలో 173 పాఠశాలలున్నాయి. వీటిలో 22,801 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం కారణంగా విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. గత ప్రభుత్వంలో 16 వేల మంది మాత్రమే ఉండేవారు.

కొత్త పుంతలు

సర్కారు స్కూళ్లలో విద్యాబోధన కొత్తపుంతలు తొక్కుతోంది. ముఖ్యంగా ప్రభుత్వం హైస్కూళ్లలో ఇంటరెక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ) ద్వారా బోధన జరుగుతోంది. ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీల ద్వారా బోధన చేస్తున్నారు. ప్రపంచాన్ని తరగతి గదిలోకి తీసుకురావడమే ఐఎఫ్‌పీ ప్రత్యేకత. దీనిద్వారా బొమ్మలు, ప్రదేశాలను చూపుతూ సమగ్రమైన బోధన చేస్తున్నారు. ప్రపంచంలోని అన్ని ప్రాంతాలను, అన్ని విషయాలను విద్యార్థులకు పరిచయం చేస్తున్నారు. సోషల్, సైన్స్ సబ్జెక్టుల్లో బొమ్మలలు ద్వారా బోధన ఉంటుంది. లెక్కలు, తెలుగు, హిందీకి సంబంధించి ఉదాహరణలు వంటి వాటిని తెలియజేస్తున్నారు. ఆంగ్లంలో బోధన ప్రత్యేకంగా సాగుతోంది. దీని ద్వారా విద్యార్థులకు నూతనోత్తేజం వస్తోంది. అన్ని విషయాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కలుగుతోంది.



ఐఎఫ్‌పీ ద్వారా బోధిస్తున్న ఉపాధ్యాయుడు

ఉదాహరణకు పిల్లలకు సింహం జీవనంపై అవగాహన కల్పించాలనుకుంటే, ఐఎఫ్‌పీలో క్లిక్ చేస్తే ఆ బొమ్మ ప్రత్యక్ష మవుతోంది. దానిని చూపించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు.

విద్యకు విశేష ప్రాధాన్యం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యకు విశేష ప్రాధాన్యమిచ్చారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు కల్పించాలన్న లక్ష్యంతో ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీల ద్వారా పాఠశాలల్లో బోధన నిర్వహిస్తున్నారు. వాటి ద్వారా అన్ని విషయాలపై విద్యార్థులు అవగాహన పెంచుకుని పోటీ పరీక్షల్లో రాణించే నైపుణ్యం ఏర్పడుతుంది.

– టి.కుశలవ దొర, ఎంఈఓ, కోరుకొండ

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా



కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయి. విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. పిల్లలు పెద్దవారయ్యాక, ఎక్కడికెళ్లినా, ఏరంగంలోనైనా రాణించేలా నైపుణ్యం పెంచుకుంటున్నారు. నాడు – నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ ఏర్పడింది.

– తాడి రజనీరెడ్డి, అన్నవరం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యురాలు

ముఖ్యమంత్రి జగన్‌కు వినతి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ జ్యోత్స్న, చిత్రంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: మండల ప్రజా పరిషత్ అధ్యక్షులకు చెల్లిస్తున్న గౌరవ వేతనాన్ని పెంచాలని, వెహికల్ అలవెన్స్ సదుపాయం కల్పించాలని, గతంలో ఉన్న చెక్ పవర్‌ని పునరుద్ధరించాలని సీతానగరం ఎంపీపీ, జిల్లా ఎంపీపీల సమాఖ్య అధ్యక్షురాలు గుర్రాల జ్యోత్స్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తోడ్పాటుతో అమరావతిలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలుసుకుని వినతిపత్రం అందజేశారు. మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను కూడా సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. తన విన్నపాలకు సీఎం సానుకూలంగా స్పందించారని జ్యోత్స్న గురువారం ఇక్కడ విలేకరులకు తెలిపారు.

ప్రజా ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- రూ. 58 లక్షలతో దుకాణ సముదాయాల ప్రారంభం



అనపర్తిలో దుకాణ సముదాయాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు

అనపర్తి: ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతుందని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. అనపర్తి మార్కెట్ ఏరియాలో పంచాయతీ ఆధ్వర్యంలో రూ. 58 లక్షలతో నిర్మించిన నాలుగు దుకాణ సముదాయాల ప్రారంభోత్సవం గురువారం జరిగింది. ఇందులో భాగంగా జ్యోతీరావ్‌పూలే పేరుతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎంపీ భరత్‌రామ్ ప్రారంభించి మాట్లాడారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డిని గెలిపిద్దామని పిలుపునిచ్చారు. బాబూ జగ్జీవన్‌రామ్ షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ప్రారంభించి మాట్లాడారు. సామాజిక న్యాయం సీఎం జగనన్నతోనే సాధ్యమైందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ మాట్లాడుతూ పేదలకు మంచి చేయాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులను చేపడుతున్న ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధే అజెండాగా పాలన

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధే అజెండాగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పల్లెల ప్రగతికి బాటలు వేస్తోందన్నారు. దేశ నాయకుల పేర్లపై దుకాణ సముదాయాలు నిర్మించి ఆ మహనీయులను స్మరించుకునే అవకాశం కల్పించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని ఎంపీ, ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్లు అభినందించారు. మార్కెట్‌లో శ్రీనివాస ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర లైవ్ ఫిష్ దుకాణాన్ని, విద్యుత్ శాఖ ఫ్యూజ్ ఆఫ్‌కాల్ సెంటర్‌ను ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. అనపర్తిలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ హాల్ట్, రైల్వే అండర్ పాస్ వంతెన నిర్మాణానికి కృషి చేయాలని కోరుతూ గ్రామస్తులు ఎంపీకి వినతిపత్రం అందజేశారు. జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, సర్పంచ్ వారా కుమారి వెంకట్రావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మల్లిడి విజయ్‌రెడ్డి, పార్టీ నాయకులు కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి, నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, చిర్ల వీర్రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



గోకవరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ జగదీష్

గోకవరం: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ జగదీష్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీగా ఆయన బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా గురువారం గోకవరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. మండలంలోని పరిస్థితులపై పోలీసులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ జిల్లాలో బ్లేడ్ బ్యాచ్‌లు, గంజాయి స్మగ్లింగ్, సారా తయారీ వంటి అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైన పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 300 మందిని బైండోవర్ చేశామన్నారు. రాత్రి సమయాల్లో నేరాలు అధికంగా జరిగే ప్రదేశాలపై నిఘా పెట్టామన్నారు. గోకవరం కేంద్రంగా తరచూ దొంగతనాలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఆయన వెంట సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్సై శివనాగ బాబు తదితరులు ఉన్నారు.

‘స్వచ్ఛతా హి సేవ’తో ఆరోగ్యవంతమైన గ్రామాలు



కరకుదురులో పారిశుధ్య కార్మికులతో కలసి కాఫీ తాగుతున్న ప్రజాప్రతినిధులు, ప్రజలు, కార్యదర్శి ప్రసన్నకుమార్

పెదపూడి: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంతో ఆరోగ్యవంతమైన గ్రామాలు ఆవిష్కృతమవుతాయని హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ అన్నారు. కరకుదురులో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం కాఫీ విత్ క్లాప్ మిత్ర నిర్వహించారు. పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. అనంతరం వారితో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు కలసి కాఫీ తాగారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు అధికారులు కృషి చేయాలన్నారు. అక్టోబర్ 2 వరకూ జరిగే ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. వైస్ ఎంపీపీ కరెడ్ల వెంకన్నబాబు, ఈఓపీఆర్డీ ఎంఎస్ఎన్ రెడ్డి, సచివాలయ కార్యదర్శి బి.ప్రసన్నకుమార్, పార్టీ నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ వాసంశెట్టి మాధవ, వీరబాబు, తోటకూర ప్రకాష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రాజానగరం: ఉద్యోగుల ప్రధాన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం సర్కిల్ పరిధిలోని జూనియర్ లైన్‌మెన్ (జేఎల్‌ఎం) గ్రేడ్ –2 అసోసియేషన్ (రి.నం.391) అధ్యక్షుడు ఐ.తాతాజీ, కార్యదర్శి ఎం.శివకృష్ణ అన్నారు. లాలాచెరువు హెచ్‌బీ కాలనీ సమీపంలోని సైకిల్ వర్తకుల సంఘ భవన్‌లో గురువారం జరిగిన అసోసియేషన్ సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. నూతనంగా జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యాజమాన్యం జేఎల్‌ఎంలను సచివాలయ సిబ్బందిగా గుర్తిస్తే, అలవెన్సులు ఇచ్చి, టైమింగ్స్ కూడా అమలు చేయాలని, లేకుంటే డిస్కంలో విలీనం చేసి, జేఎల్‌ఎంలుగా పదోన్నతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రాణాలు కోల్పోయిన జేఎల్‌ఎం గ్రేడ్ –2 కుటుంబాలలో కారుణ్య నియామకాలు నూరుశాతం పూర్తి చేయాలని కోరారు.

మహా ప్రసాదం స్వామీ



అనపర్తిలో రాంబాబు ఫ్రెండ్స్‌కు లడ్డూ అందజేస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు



పందలపాక వెలంపేటలో లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న మంగ, శ్రీనివాస్ దంపతులు

అనపర్తి: వినాయక నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక మార్కండేయపురంలో స్నేహ యూత్ ఆధ్వర్యంలో గణనాథుని విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం గణేశుని చేతిలో ఉంచిన 19 కిలోల లడ్డూకు వేలం నిర్వహించారు. దీనిని గ్రామానికి చెందిన పొన్నగంటి రాంబాబు ఫ్రెండ్స్ రూ. 37,500కు దక్కించుకున్నారు.

బిక్కవోలు: పందలపాక వెలంపేటలోని రామాలయం వద్ద సిద్ధివినాయక స్వామివారి లడ్డూ ప్రసాదానికి వేలం నిర్వహించగా మిడతాని శ్రీనివాస్, మంగ దంపతులు రూ.18 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో కూనిరెడ్డి సాంబశివ, యాసలపు శ్రీనివాస్, గండి వాసు, కర్రి శ్రీనివాస్, కర్రి సతీష్ పాల్గొన్నారు. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని పందలపాక వినాయకనగర్ కాలనీలో శుక్రవారం అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వినాయక ప్రసాదానికి వేలం

హుండీ ఆదాయం లెక్కింపు

బిక్కవోలులోని శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో హుండీలను దేవదాయశాఖ అధికారి బాలాజీ రాంప్రసాద్ పర్యవేక్షణలో లెక్కించారు. గత నెల 19 నుంచి ఇప్పటి వరకూ రూ.7,05,184 ఆదాయం వచ్చిందని ఈఓ రామలింగభాస్కర్ తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగశ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వక్రతుండాయా వందనం



తొస్సిపూడిలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న యువత



రాజానగరంలో ఊరేగుతున్న గణనాథుడు

రాజానగరం: ఒకవైపు ఉరుములు, మెరుపులు, మరోవైపు తీన్‌మార్ డ్యాన్సులు, బాణసంచా కాల్పులతో గణనాథుని విగ్రహాల ఊరేగింపు కోలాహలంగా జరిగింది. మండలంలోని పలు గ్రామాల నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి పోలవరం, పుష్కర కాలువల్లోనూ, ఫరిజల్లిపేటలోని ఊరచెరువు, సూర్యారావుపేట మునమళ్ల చెరువులోనూ నిమజ్జనం చేశారు. రాజానగరం, సూర్యారావుపేట, సంపత్‌నగరం, దివాన్‌చెరువు, కానవరం, తోకాడ, ముక్కినాడ, మల్లంపూడి, తుంగపాడు, భూపాలపట్నం, తదితర గ్రామాల్లో విగ్రహాల ఊరేగింపులు సాగాయి.

వైభవంగా గణనాథుని ఊరేగింపు

బిక్కవోలు: వక్రతుండాయా.. వందనం అంటూ ఆ స్వామివారిని భక్తజనం కొలిచింది. గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా లంబోదరుని సాదరంగా సాగనంపారు. అనపర్తి నియోజకవర్గంలో ఈ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. బిక్కవోలు మండలం తొస్సిపూడి, పందలపాక, కొంకుదురు, బిక్కవోలు, కొమరిపాలెం తదితర గ్రామాల్లో నిమజ్జనోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. స్వామివారి విగ్రహాల ఊరేగింపులో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం సమీపంలోని కాలువల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

భగత్‌సింగ్ పోరాటం స్ఫూర్తిదాయకం

రాజమహేంద్రవరం సిటీ: స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్ సింగ్ పోరాటం స్ఫూర్తిదాయకమని పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు లంక సత్యనారాయణ పిలుపు నిచ్చారు. భగత్ సింగ్ జయంతిని ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు.

మద్యం విక్రేత అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలోని భాగ్యనగర్‌లో మద్యం విక్రయిస్తున్న తాడాల సూర్యనారాయణను గురువారం అరెస్టు చేశారు. అతడి నుంచి ఆరు 180 ఎంఎల్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఈబీ నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు.

అసంఘటిత కార్మికులకు నైపుణ్య తరగతులు



మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి ఆధ్వర్యంలో గురువారం అసంఘటిత రంగ కార్మికులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి ప్రత్యూష కుమారి మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంఘం సమన్వయంతో నైపుణ్యాభివృద్ధి తరగతులు నిర్వహించనున్నామన్నారు. కార్మికులకు ఉపాధి అవకాశాలు పెంచడం ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. నల్సా అసంఘటిత రంగ కార్మికులకు న్యాయ సేవల పథకం, 2015 ద్వారా అందిస్తున్న సేవలపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం 15 మంది కార్మికులకు ఈ–శ్రమ్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ ఎంప్లాయీస్ సమావేశం



సమావేశానికి హాజరైన యూనియన్ నాయకులు

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఎంసీహెచ్ బ్లాక్ కాన్ఫరెన్స్ హాలులో గురువారం ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం జరిగింది. దీనికి యూనియన్ నాయకుడు వి.ఆశీర్వాదం అధ్యక్షత వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.గిరిబాబు, యూనియన్ నాయకులు పి.స్వామిబాబు, పరమేశ్వరి, సాయి, సుబ్బారావు హాజరయ్యారు. అనంతరం జిల్లా కార్యవర్గ సభ్యులుగా జి.హెప్సీబా, పి.రవికుమార్, బి.భాస్కరరావు, ఎ.రవికుమార్, వీవీ.శ్రీనివాసరావును నియమించారు. యూనియన్ భవిష్యత్తు ప్రణాళికపై చర్చించారు.

అమ్మ వాసు, మధుకు టూరిజం అవార్డులు

రాజమహేంద్రవరం సిటీ: నగరానికి చెందిన అమ్మ ట్రావెల్స్ అధినేత పి.శ్రీనివాసరావు (అమ్మ వాసు), గోదావరి విహారి టూరిజం అధినేత బుద్ధరాజు మధుకు బెస్ట్ టూర్ ఆపరేటర్ (బోటింగ్) ఎక్సలెన్స్ అవార్డులు లభించాయి. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తిరుపతి శిల్పారామం వేదికపై జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటకాభివృద్ధికి తోడ్పడిన పలువురికి ఈ అవార్డులు అందజేశారు. వారికి మంత్రి ఆర్కే రోజా అవార్డులు ప్రదానం చేశారు. వీరిని పలువురు ఏసీ లగ్జరీ బోటు యజమానులు, బోట్ ఆపరేటర్లు అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

కంబాలచెరువు: స్థానిక ధర్మంచర కమ్యూనిటీ ఫంక్షన్ హాలులో ఏపీ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏపీకేటీడబ్ల్యూఏ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో 2023 ఉత్తమ ఉపాధ్యాయుల అభినందన కార్యక్రమం నిర్వహించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గొప్పిశెట్టి బంగార్రాజు గురువారం తెలిపారు. దీనికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఒంటెద్దు స్వామినాయుడు, విశ్రాంత ఆర్జేడీ దేవలంక బూరయ్య హాజరయ్యారన్నారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి, తూర్పుకాపు, మున్నూరుకాపు కులస్తుల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారందరూ ఏపీకేఏటీడబ్ల్యూఏగా ఏర్పడ్డామన్నారు.

‘ఒడి’ లఘు చిత్ర బృందానికి అభినందన



చిత్రబృందాన్ని అభినందిస్తున్న జిత్‌మోహన్‌మిత్ర

రాజమహేంద్రవరం రూరల్: ఒడి లఘు చిత్ర బృందానికి ఆర్కెస్ట్రా పితామహుడు, నటగాయకుడు శ్రీపాద జిత్‌మోహన్‌మిత్ర గురువారం అభినందనలు తెలిపారు. రాజమహేంద్రవరంలోని గోదావరి మూవీస్ ఆర్టిస్ట్ అసోసియేషన్‌కు చెందిన దర్శకుడు పిచ్చుక మహేష్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. విజయవాడ తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ నిర్వహించిన లఘు చిత్రాల పోటీల్లో ప్రత్యేక జ్యూరీ విభాగంలో ఉత్తమ చిత్రంగా ఎంపికై పురస్కారం అందుకుంది. ఈ సందర్భంగా దర్శకుడు మహేష్, నిర్మాత డీఎస్ఎస్ శ్రీనివాసరావు, రచయిత గిరిధర్ కామేష్, ఉత్తమ నటన కనపరచిన ఆర్‌కే స్టడీ సెంటర్ అధినేత పులప రామకృష్ణ, డీఓపీ వెంకట్, ప్రసాద్‌కు మిత్ర అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ గిరజాల సోమరాజు నాయుడు, బొంతు వెంకట రాజు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై సదస్సు

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి ఆధ్వర్యంలో సైన్స్ అసోసియేషన్ నేతృత్వంలో గురువారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. డెల్టా ఆసుపత్రి అంకాలజిస్ట్ డాక్టర్ సుమంత్ హాజరై వివిధ రకాల క్యాన్సర్లపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.